# ఛీట్ !

వెంకట్రామయ్యను ఆవూళ్లో తెలియని వారులేరు. ఊళ్లో అందరికీ ఆత్మీయుడు ! అక్కడవుంటే ఒకేవక్క పోస్టాఫీసుకి ఆయనే సర్వం! పోస్ట్ మాస్టరు... కౌంటర్ గుమాస్తా... స్టాంప్స్ వెండరు.. అన్ని పన్లూ ఆయన చేయాల్సిందే!... ఉత్తరాలు... ఏం.ఓలు... రిజిస్ట్రేషన్ కవర్లు బట్వాడా చేయటానికి ఎంకట్రామయ్యకు తోడు దినసరి బత్తెం మీద పనిచేసే పోస్ట్‌మ్యాన్ !.

చాలా ఏళ్లుగ ఆవూళ్లోనే వుండటాన ఆయన అక్కడే స్థిరపడ్డాడు. సెంటు భూమి లేదు. నెలనెలా వచేప్చి జీతమే ఆయనకు ఆధారం ! భార్యా ముగ్గురు ఆడపిల్లలను వచ్చే కొద్దిపాటి జీతంతోనే పోషిస్తున్నాడు.

నోరుమంచిది కాబట్టి వూరు మంచిదైంది. ఆ వూరంతా కలిపితే పదివేల గడప మించివుండదు. అందరూ వ్యవసాయం మీదే బ్రతికేవాళ్లక్కడ ఓ పాతిక కుటుంబాలు కామందులవు. డబ్బు పలుకుబడి వున్న ఆసాములున్నారు. చిన్న చితక వ్యాపారం చేసుకు బతికే కుటుంబాలు... కూలీనాలీ చేసుకుని జీవించేవారి సంఖ్యే ఎక్కువ.

అయినా గ్రామస్తులందరికీ వెంకట్రామయ్య అంటే అమితమైన గౌరవం !. ఒకే ఒక్క ప్రభుత్వ పాఠశాల! టెన్త్ దాకావుంది !. ఇంటర్, డిగ్రీ చదవాలనుకునేవారంతా టౌన్‌కెళ్లాల్సిందే !

బురదనేల కావటం మూలాన వర్షాకాలంలో వూళ్లో నడవాలంటే కొత్తవారికి చీదరగ వుంటుంది. అన్నీ మట్టిరోడ్లే! డొంకదారులు ! తారు సిమెంట్ రోడ్లనేవి ఆ వూరికి దూరం ! అన్నీ రెండెడ్ల బళ్లే ! వంద ఎకరాలున్న నలుగురైదుగురు ధనవంతులు మాత్రం ట్రాక్టర్‌తో వ్యవసాయం సాగిస్తున్నారు.

ఇరుకు ఇబ్బంది అయితే వెంకట్రామయ్యను తలా ఒకచెయ్యి వేసి ఆదుకుంటూంటారు. డబ్బు సాయం చేస్తూంటారు. ఆ ఇచ్చిన బడ్బు తిరిగి తీసుకునే అలవాటులేదు.

వరి కోతల సమయంలో ధాన్యం ఆడించి నాలుగైదు బస్తాల బియ్య మొహర్బానీగ వెంట్రామయ్య ఇంటికి ఏటా పంపుతుంటారు ! ఇక కాయగూరలు.. పాలు పెరుగులాంటివాటి కోసం ఒక్క పైసా ఖర్చుపెట్టవలసిన అవసరం లేదాయనకుకు !

కొన్నేళ్లుగా రోజులలా గడిచిపోతున్నయ్ ! ముగ్గురాడపిల్లల్లో పెద్దది టెన్త్‌కొచ్చింది.

వరసపిల్లలవటాన రెండో అమ్మాయి నైన్త్ కడగొట్టుది థర్డ్‌ఫారం !

ఆ వూరి హైస్కూల్లో పిల్లలు టెన్త్ పరీక్ష ఎప్పుడూ అత్తెసరు మార్కులతో పాసవటం తప్పించి ఫస్ట్‌క్లాసు... ర్యాంకులు వచ్చిన పాపాన పోలేదు.

ఆఏడు వెంకట్రామయ్య పెద్దకూతురుకి టెన్త్‌లో స్టేట్ ఫస్టొచ్చింది. చదివినంత వరకు చాల్లెమ్మన్నాడు వెంకట్రామయ్య!. కాలేజీలో చేర్పించండి అంటూ భోరున ఏడ్చేసింది. పరాయి వూళ్లో వుంచి చదివించటం తనవల్ల కాదన్నాడు. గంతకు తగిన బొంతను చూచి పెళ్లిచేస్తానన్నాడు.

కానీ.. పిల్ల పెళ్లి చేయటమూ తనవల్ల కానిపని. తను ఇన్నేళ్ల వుద్యోగంలో కూడబెట్టిందేమీ లేదు. కట్నమిచ్చి అల్లుడిని తేగల స్థోమతాలేదు.

కటింగులు పోను తన చేతికి పదివేలు కూడా రాదు. పెద్దపిల్ల పుష్పవతి అయితే బంధువులెవ్వరికీ తెలీపచ్చులేదు. పదిమందిని ఇంటికి పిల్చి భోజనం పెట్టనూ లేదు. వేడుక చెయ్యలేదని భార్య ఒకటే ఏడుపు. పెళ్లానికి సర్దిచెప్పటం తప్ప ఏం చేయలేని స్థితి వెంకట్రామయ్యది.

గ్రామంలో కలిగిన వారికే విషయం తెల్సి... కార్యక్రమం జరిపించటానికి తలొక విధంగ సాయపడతామన్నా తల అడ్డంగ ఆడించాడు.

ఇప్పుడు అరుంధతి కాలేజీ విషయంలోనూ అదే జరిగింది. పోస్ట్‌మేస్టారి గారి కుమార్తెకు టెన్త్‌లో స్టేట్ ఫస్టొచ్చిందని తెల్సి తలిసినవారంతా వచ్చి తండ్రిని అరుంధతినీ అభినందించారు. సాయం చేస్తామన్నారు. పిల్లల చదువుకోసం... కట్నాలకోసం అప్పు చేయటం తనవల్ల కాదని తెగేసి చెప్పాడు.

వెంకట్రామయ్య మూర్ఖత్వానికి గ్రామపెద్దలు విస్తుపోవటం తప్పించి మరే విధంగానూ వెంటట్రామయ్యను వప్పించలేకపోయారు.

పరాయవూళ్లో... బంధువుల ఇళ్లల్లో వుంచటం ఇష్టంలేదు. నెలకింతని వాళ్లకు పంపనూ లేదు. కాలేజీ ఫీజులు ఇత్యాది ఖర్చు తాను తట్టుకోనూ లేడు.

తెలివైన కూతురును చదించలేని తన అశక్తతకు బాధపడని క్షణం లేదు. అంత తెలవైన పిల్ల తన కడుపున పుట్టకపోయినా బావుండేదనిన్పించింది.

రేపనే రోజున ముగ్గురు ఆడపిల్లల వివాహాలు జరిపించగల స్తోమత తనకు లేదు. పౌరోహిత్యం చేసుకు పొట్టపోసుకుంటున్న మగపిల్లలక్కూడా అధిక కట్నాలు ఆశిస్తున్న ఈ రోజుల్లో తనవంటి దౌర్భాగ్యుడి కడుపున ముగ్గురు ఆడప్లిలలను ఆ

దేవుడు ఎందుకు పుట్టించాడోని బాధపడని రోజులేదు.

ముగ్గురు కుమార్తెల పెళ్లిళ్లు చేసి వారిని అత్తవారిళ్లకు సాగనంపాలీ అంటే మాటలా ?. కనీసం తనవద్ద పదిలక్షలైనా వుండాలి!. తనవద్ద ఎర్రనిఏగాని లేదు.

కుటుంబమంతా కల్సి ఆత్మహత్యకు పాల్పడటం ఒక్కటే మార్గంగా తోచింది. తనకు చావంటే భయంలేదు కానీ భార్యాపిల్లలను చంపే అధికారం తనకు లేదు. తనదోవ తాను చూచుకుంటే వాళ్లేమైపోతారోనే భీతి మరో వైపు వేధిస్తోంది.

వయసొచ్చిన ముగ్గురు ఆడపిల్లలతో భార్య వక్కతే... భర్త అనబడే మగాడి తోడు లేకుండా బ్రతగ్గలగటం ఈ పాపిష్ఠి సొసైటీలో సాధ్యమా? ఎంత దుర్భరంగ వారి భవిత వుంటుందో వూహిచలేకపోతున్నాడు.'

X X X

కొయ్యగొణతం... సత్తు బొచ్చలు తప్ప ఇంట్లో సామానంటూ పెద్దగా లేవు. డబ్బులేని కారణంగ ఏ వస్తువునూ సముమార్జించుకోలేదు వెంకట్రామయ్య. గ్యాసుపొయ్యి కూడా లేదు. ఇన్నేళ్లుగా కట్టెల పొయ్యి మీదే ఇంట్లో వంటా వార్పూ !

భార్య ముక్కుపుడక విరిగపోతే.. బంగారం ధర ఆకాశాన్నటుతున్న కారణాన తిరిగి కొత్తది చేయంచలేని స్థితి తనది!.

స్కూలుకెళ్లి చదువుకునే ముగ్గురు ఆడపిల్లలకైనా మంచి బట్టలు కొనిపెట్టలేని అసమర్ధుడు తాను. ఇంక కాలేజీ చదువలేం చెప్పించగలడు? వివాహాలేం చెయ్యగలడు?

ఒకవైపు పెరిగే ధరలు... మరోవైపు అప్పుల బాధ!.. ఈ రెండు చక్రాల నడుమ వెంట్రామయ్య బ్రతుకు నలిగిపోతోంది.

దరిద్రాన్ని దూరం చేసుకోగల పరిష్కారమార్గం కోసం తీవ్రంగ యోచిస్తున్నాడు. అసమర్ధుని జీవన యాత్ర ఇలా కొనసాగవలసిందేనాని అనుక్షణం అవేదనకు గురికాక తప్పటంలేదు.

ఇలా అయితే ఇక లాభం లేదు. నీతి నిజాయితీ అని మడికట్టుకుని కూర్చుంటే ప్రయోజనం శూన్యమన్పించసాగింది. పాలకులు... నేతలు... అంతా దోచుకుంటుండగ తన్లాంటి వారిలా బ్రతుకుపోరు సాగించటం న్యామన్పిస్తోంది. అవినీతి దశదిశలా వ్యాపించింది. నీతికి న్యాయానికి దర్మానికి చోటు లేకుండా పోయింది. దోపిడీ వ్యవస్థలో తన్లాంటి వారు జీవించేదేలా ? అవసరాలు

తీర్చుకోగలిగేదెలా?-

అంతమాత్రాన తనూ తప్పు చేయాలా? అందుకు అతరాత్మ అంగీకరించటం లేదు. భవిస్యత్ వెక్కిరిస్తోంది. తనను అవహేళన చేస్తోంది. భయపెడుతోంది.

ఆలోచించగా ... ఒకేవక్క పరిష్కారమార్గం గోచరించింది ! తనూ బాగుపడాలి ! తన కుటుంబ అవసరాలు తీరాలి ! అందకొక్కటే మార్గం అల్లంత దూరంలో ఆశాకిరణమై తనను చేతులు చాపి పిలుస్తోంది.

X X X

వెంకట్రామయ్యకు పదిరోజుల లీవు శాంక్షన్ కావటంతో అతని స్థానంలో వచ్చిన మరోవ్యక్తికి ఛార్జ్ హేండోవర్ చేసి కుటుంబంతో సహా గ్రామం విడిచి వెళ్లిపోయాడు.

ఎప్పుడు వస్తాడో? అసలు తిరిగి వస్తాడోరాడో? ఉద్యోగంలో తిరిగి చేరతాడో లేదో అనే విషయాలు ఎవ్వరికీ ఏమీ తెలియదు.

కొన్నేళ్లుగ అలవాటైన మనిషి వెంకట్రామయ్య పోష్టమాస్టారు తన సీట్లో కనిపించకపోవటంతో గ్రామస్తులందరికీ ఏదో వెలితి అన్పించింది.

ఎన్నడూ... గ్రామం వదిలి ఎక్కడికీ వెళ్లని వెంకట్రామయ్య ఎక్కడికెళ్లాడో ఎవ్వరూ వూహిచలేకపోయారు. ఆయన గురించి వివరాలు చెప్పగలవారు లేకపోయారు.

ఆయన బదులు వచ్చిన పోస్టమాస్టర్ని అడిగితే తానేమీ చెప్పలేనని తనకేమీ తెలియదనీ అనటం పలు అనుమానాలకు తావిచ్చింది.

ఆర్థికపరమైన బాధలు అనుభవించలేక సకుటుంబంగా ఏ గోదాట్లో అయినా దూకి ఆత్మహత్య చేసుకోవటానికి గ్రామస్థులెవ్వరికీ చెప్పకుండా వెళ్లలేదు కదానే శంక అనేకమందిలో కలిగింది.

రోజులు గడుస్తున్నయ్ ! నెలలు దొర్లిపోతున్నయ్!. వెంకట్రామయ్య కుటుంబ జాడ తెలియక కంగారు పడ్డారు గ్రామ వాసులు !

అగ్ని పర్వతం బ్రద్దలైనట్టు ఒకరోజున అసలు విషయం బైటపడటంతో వూళ్లోవారంతా ముక్కున వేలేసుకున్నారు. అటుపై గుండెలు బాదుకున్నారు. తమకు జరిగిన అన్యాయానికి లబలబ మొత్తుకున్నారు.

వెంట్రామయ్య ఎంతో మంచివాడనుకున్నారు. సాయం చేశారు. చివరికి ఈ విధంగ నమ్మించి మోసం చేసి తీరని ద్రోహం తలపెడతాడాని గ్రామంలో వారంతా

ఘొల్లుమన్నారు.

తాము పోస్టాఫీస్‌లో దాచుకున్న డబ్బంతా దోచుకుని పారిపోతాడా? ఎంతటి నయవంచన? అయినా మంది సొమ్ము కాజేయటానికి ఆయనగారికి ఇదేం దుర్బుద్ధి? ఎంత మంచివాడుగా నటించాడు. వెంకట్రామయ్యను ఎంతగ అభిమానించి ప్రేమించారో... వారంతా ఇప్పుడు దుమ్మెత్తిపోశారు. నోటికొచ్చిన విధంగ దూషించారు.

పోస్టల్ డిపార్ట్‌మెంట్ అధికారబృందం పోస్టాఫీసులో జరిగిన అవకతవకలన్నింటినీ తవ్వి వెలికితీశారు.

ఇన్నేళ్లుగా గ్రామస్థులు జమచేస్తున్న డబ్బు డిపార్ట్‌మెంట్‌కు అందజేయకుండానే వారికి నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్లు పంపిణీచేశాడు. డబ్బు తీసుకుని వారి ఎకౌంట్ పాస్‌పుస్తకాల్లో మాత్రం ముట్టినట్టుగా సీలు వేస్తూ వచ్చాడు.

రమారమి గ్రామస్తులు పొగొట్టుకున్న డబ్బు పదిహేను లక్షలకు పైబడే వుంటుందని అధికారులు లెక్కలు తేల్చారు.

డిపార్ట్‌మెంట్ పోలీసు రిపోర్ట్ ఇచ్చింది.

ప్రభుత్వ సొమ్మును దిగమింగి పత్తాలేకుండాపోయిన వెంకట్రామయ్య గురించి పేపర్లలో వార్తలొచ్చినయ్! ఖాతాదారుల సొమ్ము కైంకర్యం చేసి అడ్రసులేకుండా వెళ్లిపోయిన వెంకట్రామయ్య గురించి అన్ని టీ.వీ. ఛానళ్లు వధలు కథలుగా ప్రసారం చేసినయ్. రోజులు... నెలలు... సంవత్సరాలు గడుస్తున్నా... పోలీసువారికి వెంకట్రామయ్య ఆచూకీ తెలియరాలేదు.

డిపార్ట్‌మెంట్ ఎక్స్పార్టీ ఎంక్వయిరీ చేసి నేరస్థుడిగా చర్యతీసుకునే ప్రయత్నంలో వుద్యోగం లోంచి వెంకట్రామయ్యను డిస్మిస్ చేసి పోయిన డబ్బును రైటాఫ్ చేయక తప్పలేదు.

వెంకట్రామయ్య వంటి వారెందరో ఈ సొసైటీలో..?.

అజ్ఞాతంలోకి వెళిపోయిన వెంకట్రామయ్య కొన్నాళ్లకు... ముగ్గురు ఆడపిల్లల వివాహాలు జరిపించి అత్తవారిళ్లకు పంపించాడనే వార్త గోప్యంగానే వుండిపోయింది.

ఖాతాదారులు దాచుకున్న డబ్బు దోచుకున్న వెంట్రామయ్య ప్రజల... పోలీసుల... డిపార్ట్‌మెంట్ వారి దృష్టిలో దోషి (ఛీట్) గా మిగిలిపోయాడు.

---సమాప్తం---